# అంగడి

టౌను పక్కనేగల పదెకరాల వ్యవసాయ భూమిని ఓ నలుగురు కల్సి ప్లాట్స్ చేసి అమ్మితే జనం విరగబడి కొని తమ వనరుల ననుసరించి ఇళ్లను నిర్మించుకున్నారు.

రోడ్లుగాని నీళ్ల సౌకర్యంగాని ఇంకా రాలేదు. పోయినసారి మున్సిపల్ ఎన్నికల్లో తమ కొత్తపేట నుండి ఎన్నికైన వ్యక్తి పట్టిచ్చుకోలేదు. ఆయనగారు చేసిన వాగ్ధానాలన్ని అలాగే నిలిచిపోయాయి. ఎంతో ప్రయత్నం మీద ఎంతో కొంత ఖర్చు పెట్టుకుంటే గాని ఆమాత్రం విద్యుత్తు సౌకర్యం రాలేదు. నీళ్ళ గురించి ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలితం దక్కలేదు.

ఆవాడకు నీటి సౌకర్యం రావాలంటే పక్కన్నే కిలోమీటరు దూరం నుండి పాతనగరంలోకి వెళ్లే మెయిన్‌లైన్ నుండి కొత్తపేట లోకి మరోలైన్ వేసుకురావాలి.

ఆ తర్వాత కొత్తపేట నలువైపులా నీరు అందించడం కోసం ఫ్లస్ గుర్తులో మరి రెండు డిస్ట్రిబ్యూషన్ లైన్స్ వేసితేగాని జనం వాటి నుండి తమ తమ ఇళ్లలోకి అరంగుళం పైపులో నేరుగా నీరు తీసుకోవచ్చు.

ఇంత పని జరగడానికి ఎంతో పలుకుబడి అవసరం ఈ రోజుల్లో అన్న విషయము ఆ పేటనాళ్ళక్కూడ తెలిసిపోయింది. మళ్ళీ మున్సిపల్ ఎన్నికలు రానే వచ్చినవి. ఆ వార్డు నుండి నలుగురు నిలుచున్నారు. రాజకీయ పార్టీలు రెండు ఇద్దరు కాండిడేట్స్ నిలుచోబెట్టగ మరో ఇద్దరు ఇండిపెండెంట్లుగా కూడ నిలుచున్నారు. ప్రచారం ముమ్మరంగా నడుస్తోంది. తమ తమ ఉద్దేశాలను తమ పార్టీ పెద్దల ఉపన్యాసాలను క్యాసెట్‌ల ద్వారా వినిపిస్తున్నారు. పట్టణమంతా సందడిగా ఉంది. ఓటర్లు ఎటు ఆలోచించాలో తెలియక కంగారెత్తి పోతున్నారు. ఆ రోజు

రాత్ర కొత్తపేట మధ్యలోని విశాలమైన ప్రదేశంలో ఓ బహిరంగసభ పెట్టారు. నిల్చున్న అభ్యర్థులందరూ తమ తమ పరిచయాలను చేసుకుంటు తాము ఎన్నికైతే ఏమేమి చేయనున్నారో ఒక్కొక్కరే చెపుతువున్నరు. ఆ తర్వాత వార్డులోని కొందరు పెద్దమనుషులు మాట్లాడారు. వారు గత చరిత్రను ముందుపెడుతు రాబోవు కాలంలో ఎవరు ఏమి చేయరు. ఈ ఎన్నికలప్పుడు ఇలా మాట్లాడుతరు. అంతే, అని తేల్చగ.

అవన్నీ పోనియ్యండి. ఈసారి ఈవార్డు నుండి గెలవాలనుకున్న వ్యక్తి మాపేటకు మంచినీటి సౌకర్యం కలిగిస్తే చాలు. మా అందరి ఓట్లు వారిఇకే అతన్ని తప్పక గెలిపిస్తం. అట్లా అని కాగితాలు రాసిస్తాం " అంటు యువకులు ఓ ప్రతిపాదనను ప్రకటించారు. దానికి మద్దతుగ అందరు చప్పట్లు కొట్టారు.

ఈ మాట అభ్యర్థులకు ఆందోళన కలిగించినా దాని గూర్చి ఆలోచిస్తున్నారు. వాదోప వాదాలు జరిగినవి. చివరికి ఓ రాజీకి వచ్చారు.

గెలిపించని పక్షంలో ఆపైప్‌లైన్ ఖర్చు, మరో పదివేలు అదనంగా తిరిగి చెల్లించాలి. ఈశరతు మీద అక్కడ పైప్‌లైన్ వేయించడానికి ఇండిపెండెంట్ అభ్యర్థి, రైస్‌మిల్ ఓనరు రంగారావుగారు ఒప్పుకున్నరు.

ఆ మేరకు కాగితాలు రాసుకున్నరు. మరునాడు పని ప్రారంభమై పదిహేను రోజుల్లో పూర్తి అయ్యింది. ఆ తర్వాత నాలుగోనాడు ఎన్నికలు జరిగిన కొత్తపేట జనం అన్న ప్రకారంగా రంగారావును గెలిపించారు.

పెద్ద రాజకీయ పార్టీలలోని వ్యక్తుల వ్యక్తిగత కక్షలవల్ల, గ్రూప్‌లవల్లనైతేనేమి రంగారావుగారు వేసిన చిన్నగాలానికి పెద్ద చేపపడింది. వడ్లగిర్ని రైస్‌మిల్ అయినట్టు. కౌన్సిలర్ ఛైర్మన్ అయ్యాడు. అందరూ అభినందించదగ తాను సంతోషించాడు.

అందరికంటే కొత్తపేట జనం ఎగిరిగంతేసి వారం రోజుల్లో మెయిన్‌లైన్ నుండి తమ వాడ లైన్‌లోకి నీళ్ళు రావడానికి కావలసిన ఏర్పాటు చేయించుకున్నరు. వాళ్ళు కోరిన మేరకు అనుకున్నప్పుడు అన్నీ చేసి పెట్టారు. ఛైర్మన్ గారు పురపాలక సంఘం మంత్రిగారు నీరు వొదులుతరు. ఆసభకు ఛైర్మన్ గారే అధ్యక్షులు తొలిపలుకుల

తర్వాత ఆ ప్రాంతపు ప్రజలు చేతులు జోడించి నమస్కారాలు చేసేటప్పుడు ఆయన మేడకు ఓ బరువైన పూలదండ పడింది. చప్పట్లు మారు మోగాయి. మంత్రి గారు " అభివృద్ధిలోకి వస్తవు " అంటూ ఆశీర్వదించారు. సభ ముగిసింది. మరునాడు కొత్తపేట జనం నల్లా కనక్షన్స్ దరఖాస్తు ఫారాలకోసం మున్సిపల్ ఆఫీసులో కిక్కిరిసిపోయారు. కమీషనర్ కసురుతున్నాడు. ఛైర్మన్ చిరునవ్వు నవ్వుతూ కార్యకర్తలను తన చూట్టురా కూర్చొబెట్టుకొని సాదక బాధకాలు చెపుతున్నాడు. వేడికి వేడి విరుగుడైనట్టు ఛైర్మన్ తెప్పించిన వేడి వేడి టీ తాగుతుంటూ తమ కోపాన్ని కాస్తా అణుచుకుని నవ్వులో నవ్వు కలిపినరు.

ఆరోజు రాత్రి కొత్తపేట పెద్ద మనుషులను ఛైర్మన్ నుండి పిలుపొచ్చింది. చదువుకున్న వారికి చదువుకోని వారికి అందరికి మున్సిపల్ డాగ్‌బంగ్లాలో విస్కీతో సత్కారం జరిగింది. ఉదయం పులుల్లా వున్నవాళ్లు పార్టికొచ్చి పోయేటపుడు పిల్లుల్లా అయ్యారు.

మున్సిపల్ గుమస్తా వొచ్చిన వాళ్లందర్కి నల్లా కనక్షన్ గూర్చిన ఫారాలు ఇస్తున్నడు. కొందరు తిడుతూ మరి కొందరు మౌనంగ, మరి కొందరు మళ్ళీ ఎన్నికలురానీ రకరకాలుగా గునుగుతూ రశీదు లేకుండానే వెల చెల్లిస్తు ఫారాలను తీసుకొనిపోతువున్నరు.

ఓసారి మావాడలోని ఓ ఇంట్లో రాత్రి దొంగపడితే తెల్లారే వరకు వూరంతా తెలిసిపోయినట్టే ఈ విషయం పట్టణమంతా పాకింది. అదే విషయాన్ని ఛైర్మన్‌గారి చెవిలో వేస్తె ఆమాత్రం వ్యాపార రహస్యం తెలియని మూర్ఖులా మన జనం అంటూ నవ్వారు.

' ఈ వ్యాపారం సాగినంత కాలం ఊరు బాగుపడదు ' అని ఊడిచే వాళ్లు అనుకుంటు చెత్తను కుప్పలుగా చేస్తువున్నరు.

● 1, అక్టోబర్ 2005